వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం, బలిహరణం, రాత్రి స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పుర వీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. మంగళహారతులు పట్టారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు స్వామి వారి రథోత్సవం ఉంటుందని ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్ తెలిపారు.

ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేయరా?

- గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

నిజాంపేట్: ప్రధాన రోడ్ల మరమ్మతులకు నోచుకోవడం లేదు. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలల తరబడి రోడ్లపై ఉన్న గుంతలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. నిజాంపేట్ నుంచి బాచుపల్లి వైపు వెళ్లే రోడ్డుపై జేఎస్ వైన్స్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయలేక ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించే బారికేడ్‌ను సూచికగా ఏర్పాటు చేశారు. వాటర్ వర్క్స్ విభాగం అధికారులు పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి



బాచుపల్లిలో ప్రధాన రోడ్డుపై..



నిజాంపేట్‌లో ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంత

పనులు పూర్తి చేసిన తరువాత గుంతలను అలాగే వదిలేశారు. ఈ గుంతలో వాహనదారులు పడకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులు బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా బాచుపల్లి నుంచి గండి మైసమ్మ చౌరస్తా వైపు వెళ్లే రోడ్డులో బాచుపల్లి వద్ద పైపులైన్ పనులు పూర్తి చేసి గుంతలను వదిలేశారు. ఇలా అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే రోడ్ల మరమ్మతులు పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి వివిధ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా వేడుకలు, జాతర సందర్భంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

అదనపు తరగతుల నిర్మాణానికి స్థలం కేటాయింపు



నిజాంపేట్ : బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు గురువారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. స్కూల్ పక్కనే జలమండలికి ఒక ఎకరం స్థలం కేటాయించారు. జలమండలి ఆధీనంలో ఎకరం స్థలం కంటే ఎక్కువ ఉందని, ఆ స్థలాన్ని పాఠశాల అదనపు తరగతుల కోసం వినియోగించాలని హెచ్ఎం రామకృష్ణ తదితరులు జిల్లా అధికారులను పలుమార్లు కోరారు. దీంతో స్పందించిన అధికారులు తహసీల్దార్, జలమండలి అధికారులు, ఎంఈఓ సమక్షంలో సర్వే చేశారు. పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం సుమారు రూ.25 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరయ్యాయి.

ఉమామహేశ్వర ఆలయంలో శివస్వాముల పూజలు

సుభాష్‌నగర్: సూరారం ఉమామహేశ్వర ఆలయంలో గురువారం శివస్వాములు పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల స్వాములు పూజలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శివ స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.



భిక్షలో పాల్గొన్న శివ స్వాములు

బాచుపల్లి ఎస్ఆర్ కాలేజీకి ఇంటర్ బోర్డు నోటీసులు

విద్యార్థిని పూజిత మృతిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశం

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్ఆర్ బాలికల జూనియర్ కాలేజీకి ఇంటర్ బోర్డు అధికారులు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బుధవారం ఉదయం ఇంటర్ సెంకడ్ ఇయర్ చదివే పూజిత(17)అనే విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో కాలేజీ యాజమాన్యం తమకు తప్పుడు సమాచారం ఇచ్చారని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు. మొదట బాత్‌రూంలో జారీ పడిందని, తరువాత మృతి చెందిందని చెప్పి గాంధీ ఆసుపత్రికి రావాలని చెప్పడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాలేజీ యాజమాన్యం చేసిన తీవ్ర మానసిక ఒత్తిడితోనే తమ కూతురు మృతి చెందిందని తల్లిదండ్రులు దేవి, శ్రీనివాస్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో స్పందించిన మేడ్చల్ జిల్లా ఇంటర్ బోర్డు అధికారి కిషన్ కాలేజీకి విద్యార్థిని మృతిపై నివేదిక ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు.

రక్తదాన శిబిరాల ఏర్పాటు అభినందనీయం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఏసీపీ హనుమంత్‌రావు

జగద్గిరిగుట్ట: సమాజ శ్రేయస్సు కోసం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బాలానగర్ ఏసీపీ హనుమంత్‌రావు అన్నారు. సైబర్ బాధితుల ఫౌండేషన్ ప్రెసిడెంట్ గుల్ల నాగరాజు, వ్యవస్థాపకులు పులి అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలో దుర్గమ్మ ఆలయ సమీపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 55 మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఇలాంటి శిబిరాలను మరిన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, ఎస్ఐలు రాజేష్, రంజిత్, అబ్దుల్ హయ్యూం, గుల్ల కల్పన, న్యాయవాది శ్వేత, సాయి సేవా సమితి అధ్యక్షురాలు యర్రం శాంతి గుప్తా, రాజు, వెంకటేష్, సోమాగోని శృతి, జాన్వేష్, వంశీ, అరవింద్, భాగ్య, సిరి, మానస, దివ్య పాల్గొన్నారు.



కబ్జాలో సర్కారు జాగా!

- సర్వే నంబర్ 100పై కబ్జాదారుల కన్ను
- మూడు రోజులుగా మళ్లీ పనులు

ఓ వైపు ప్రభుత్వ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ రెవెన్యూ అధికారులు కట్టడి చేస్తున్నారు. మరోవైపు కబ్జారాయులు కొత్త పంథాలో కబ్జాలకు తెర లేపారు. పశువుల పాకలు ఏర్పాటు చేసి వాటి నీడలో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాజేస్తున్నారు. అధికారులు ఇప్పటికే నాలుగు సార్లు కూల్చివేసిన మళ్లీ నిర్మాణాలను చేపట్టడం విడ్డూరంగా ఉంది. కబ్జాదారుల కన్ను మళ్లీ ఓక్షిత్ ఎన్క్లేవ్‌లో సర్వే నం.100పై పడింది. దీంతో మూడు రోజులుగా కబ్జాదారులు నిర్మాణ పనులు చేపట్టడం గమనార్హం. మరి దీనిపై గతంలో లానే సంబంధిత శాఖ అధికారులు స్పందిస్తారో?, లేదో? వేచి చూడాలి.

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎన్క్లేవ్‌లో సర్వే నంబర్ 100లో 15 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలం ఉంది. గాజుల రామారం చెరువు దిగువ భాగాన పచ్చని పొలాల మధ్య ఈ స్థలంలో ఎండాకాలంలో సైతం నీరు పుష్కలంగా ఉండేది. నగరం అభివృద్ధి చెందుతున్న తరుణంలో పంట పొలాల్లో సైతం కాలనీలు వెలిశాయి. దీంతో అక్కడ అధునాతన అంగులతో విల్లాలు, అపార్ట్‌మెంట్లు రావడంతో అక్కడ గజం స్థలం రూ.80 వేల వరకు పాకింది. దీంతో కొంత మంది కన్ను కాలనీ మధ్యలో ఉన్న సర్వే నంబర్ 100 ప్రభుత్వ స్థలంపై పడి కబ్జా చేస్తున్నారు.

పశువుల పాక పేరుతో..

విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు కొంతమంది ముందుగా పశువుల పాకలు వేశారు. చుట్టూ గడ్డివాములు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా ఎంచక్కా గదులు నిర్మించారు. ఇలా ఇప్పటికి సర్వే నంబర్ 100లో 70 శాతం మేర ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారు.



ఐదు సంవత్సరాల క్రితం సర్వే నంబర్ 100లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలం

మిగతా స్థలం కాజేసేందుకు..

మిగిలి ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు మూడు రోజుల నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాత్రికి రాత్రే 500 గజాల విస్తీర్ణంలో పశువుల పాక వేశారు. ఇక అధికారులు పట్టించుకోకుంటే సదరు స్థలం వారి ఖాతాలోకి వెళ్లినట్టే. ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలకు సైతం విద్యుత్ మీటర్లు బిగించారు. ఓ వ్యక్తి కమర్షియల్ పర్పస్ షెటర్‌ను నిర్మించాడు. వీరికి విద్యుత్ అధికారులు కరెంటు మీటర్లు ఎలా ఇచ్చారోనని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

తక్షణమే పాకలను తొలగిస్తాం



సర్వే నంబర్ 100లో పశువుల పేరుతో జరుగుతున్న నిర్మాణాలపై సమాచారం తెలిసిన వెంటనే గతంలోనే పశువుల పాకలను నాలుగు సార్లు కూల్చివేశాం. సదరు సర్వే నంబర్‌లోని స్థల విషయంపై హైడ్రా అధికారులకు నివేదిక అందించాం. తాజాగా వేసిన పశువుల పాక విషయం తెలియదు. తక్షణమే వాటిని తొలగిస్తాం. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తాం.

– గులాం కలీం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

డ్రైవర్ అదృశ్యం



ప్రభీర్ కుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్ : ఓ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రభీర్ కుమార్(33) గత కొంత కాలంగా దేవరయంజాల్ ప్రాంతంలోని ఓ డెకరేషన్ షాపులో డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన డీసీఎం గోదాం వద్ద నిలిపి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, డెకరేషన్ నిర్వాహకులు వెతికినా ఆచూకీ లభించలేదు. మొబైల్ స్విచ్ ఆఫ్ రావడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయరూ?

జీడిమెట్ల: సుభాష్‌నగర్ 40 ఫీట్ల రోడ్డులో పదిరోజులు క్రితం మ్యాన్‌హోల్ మూత విరిగిపోయింది. రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ గుంత వల్ల వాహనదారులకు ప్రమాదం జరగకుండా స్థానికులు గుంతలో చెట్ల కొమ్మలను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సీఎస్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

కూకట్‌పల్లి: ఫ్రీడం ఆయిల్ ఆధ్వర్యంలో నడుస్తున్న సీఎస్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఫ్రీడం ఆయిల్ కంపెనీ ఎండీ ప్రదీప్ చౌదరిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని, బాలాజీనగర్‌లో సుమారు 2.5 ఎకరాలలో ఫ్రీడం పార్కును అభివృద్ధి చేశారని తెలిపారు. రెయిన్‌బో విస్తా పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో స్కూలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ప్రదీప్ చౌదరి సానుకూలంగా స్పందిస్తూ.. నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ జీఎంకు అస్వస్థత


చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస, గుండె సంబంధిత ఇబ్బందులతో సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కాస్త నిలకడగానే ఉంది. మరి కొన్ని రోజులు చికిత్స కొనసాగుతుండటంతో శుక్రవారం లేదా శనివారం ఇన్‌చార్జి జీఎంగా మరో అధికారికి బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కీసర చరిత్రకు మోక్షమెప్పుడో ?

నగరానికి చేరువలో చక్కటి ప్రకృతి రమణీయత కలిగి ఎంతో చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని ఆర్కియాలజీ మ్యూజియానికి ఆలన–పాలన లేక శిథిలావస్థకు చేరుకుంది.

- ప్రస్తుతం కళావిహీనంగా పిచ్చిమొక్కలతో..
- శిథిలావస్థలో ఆర్కియాలజీ మ్యూజియం
- విష్ణుకుండినుల రాజధానిగా పాలించినట్లు ఆధారాలు

నగరానికి చేరువలో ప్రఖ్యాత శైవ క్షేత్రం



శిథిలావస్థలో ఆర్కియాలజీ మ్యూజియం

కీసర : పురావస్తుశాఖ ఆధ్వర్యంలో గతంలో ఇక్కడ జరిపిన తవ్వకాల్లో క్రీ.శ 4–5 శతాబ్ద కాలంలో ఆంధ్రదేశాన్ని పాలించిన విష్ణుకుండినుల రాజధానిగా ఈ ప్రాంతం విరసిల్లినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని చరిత్ర కారులు చెబుతున్నారు.

1000కి పైగా యాగాలు..

ఈ వంశానికి చెందిన రెండో మాధవవర్మ, ఆశ్వమేధయాగం, 1000 పైగా ఇతర యాగాలు నిర్వహించి నర్మదానది వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసినట్లు పురావస్తుశాఖ గుర్తించింది.

బయటపడిన దేవతా విగ్రహాలు..

కీసరగుట్టలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తవ్వకాల్లో బయటపడిన విష్ణుకుండినుల రాజప్రసాదాలు, దేవాలయం, వారి కాలంలో వాడిన వివిధ వస్తువులు, పలు దేవుళ్ల విగ్రహాలు బయటపడ్డాయి.

పురావస్తు శాఖ ఆధీనంలోకి..

ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఈ ప్రాంతం విశిష్టతతో పాటు తవ్వకాల్లో లభించిన వాటిని భవిష్యత్ తరాలు తెలుసుకునేలా ఈ ప్రాంతం చుట్టూ పురావస్తుశాఖ ఆధీనంలోకి తీసుకుంది. రాజప్రసాదాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మించింది.

మ్యూజియం ఏర్పాటు..

పురావస్తు జరిపిన తవ్వకాల్లో బయటపడిన ఆనాటి వివిధ వస్తువులను భద్రపరిచేందుకు ఆర్కియాలజీ మ్యూజియం కుడా నిర్మించి గతంలో కీసరగుట్టకు వచ్చే యాత్రికుల సందర్శనకు అనుమతించారు.

పిచ్చిమొక్కలకు నిలయంగా..

కొన్నేళ్ల నుంచి ఆర్కియాలజీ మూతపడటంతో కీసరగుట్టకు వచ్చే యాత్రికులకు, విష్ణుకుండినుల చరిత్ర అలనాటి కట్టడాలను, విష్ణుకుండినుల పాలన కాలంలో వాడిన వస్తువులు, దేవతామూర్తుల విగ్రహాలను సందర్శించే అవకాశం లేకుండా పోయింది. మ్యూజియం వద్ద ఎలాంటి ఆలనాపాలన లేని కారణంగా రాజప్రసాదాల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మ్యూజియం భవనం కుడా శిథిలావస్తకు చేరుకుంది.

ప్రభుత్వమే పరిరక్షించాలి..

ఇక్కడ లభించిన వివిధ వస్తువులను పురావస్తుశాఖ ప్రధాన కార్యాలయానికి తరలించారు. దీంతో ఇక్కడికి వచ్చే యాత్రికులకు ఇక్కడి చరిత్ర తెలుసుకోవడానికి వీలు లేకుండా పోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, పురావస్తుశాఖ అధికారులు స్పందించి ఆర్కియాలజీ మ్యూజియానికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మ్యూజియాన్ని తీర్చిదిద్దడంతో పాటు వస్తువులను కుడా అందుబాటులో ఉంచి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు వచ్చే యాత్రికుల సందర్శనకు అనుమతించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



కీసరగుట్టకు వచ్చే యాత్రికులు ఇక్కడి చరిత్రను తెలుసుకునేందుకు వీలుగా పురావస్తుశాఖ గతంలో నిర్మించిన మ్యూజియానికి మరమ్మతులు చేపట్టి విష్ణుకుండినుల పాలన నాటి వస్తువులను మ్యూజియంలోనే భద్రపరిచి యాత్రికులను అనుమతించాలి.

– బండారి శ్రీనివాస్‌రెడ్డి, కీసర

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కైలాష్ హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మహదేవపురం, బాలయ్యబస్తీ, షిరిడీ హిల్స్, ఐశ్వర్య ఎస్టేట్స్, నందాహిల్స్, మహదేవపురం వార్డు కార్యాలయ ప్రాంతం, లలిత హాస్పిటల్ లేన్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు ఇమ్మానుయేలు ప్రార్థన మందిరం 15వ వార్షికోత్సవం

నిజాంపేట్ : నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో ఇమ్మానుయేలు ప్రార్థన మందిరం 15వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు పాస్టర్ సిరిగల బాలరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, పాస్టర్ డేవిడ్ బాబు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు.

నేడు ముకుంద జ్యువెలర్స్ షోరూం ప్రారంభం

కుత్బుల్లాపూర్: ముకుంద జ్యువెలర్స్ నూతన శాఖను శుక్రవారం జీడిమెట్ల డివిజన్ సుచిత్ర సర్కిల్‌లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే కూకట్‌పల్లి, కొత్తపేట, సోమాజిగూడ, ఖమ్మం, హన్మకొండలో తమ శాఖలు కొనసాగుతున్నాయని, సుచిత్రలో 6వ శాఖను ఉదయం 11.30 గంటలకు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

19న ఛత్రపతి శివాజీ పురస్కారాల ప్రదానం

రంగారెడ్డినగర్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న భాగ్యనగర్ ఛత్రపతి శివాజీ జాతీయ పురస్కారాలు అందజేయనున్నట్లు సమతి అధ్యక్షుడు నందనం దివాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్ర 6 గంటలకు రంగారెడ్డి నగర్‌లోని శివాజీ చౌక్ వద్ద కార్యక్రమం ఉంటుందని, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్



కూన శ్రీశైలంగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొంపల్లి మున్సిపల్ కమిషనర్

కుత్బుల్లాపూర్ : షాపూర్‌నగర్‌లో తన నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను గురువారం కొంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ క్రిష్ణారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కూన శ్రీశైలంగౌడ్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ ఉన్నారు.

డీసీఎంపై ఒరిగిన చెట్టు.. తప్పిన ప్రమాదం



సుభాష్‌నగర్: నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డులో ఉన్నటువంటి ఓ చెట్టు కూలుతుండగా అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఓ డీసీఎంపై పడటంతో పెను ప్రమాదం తప్పింది. షాపూర్‌నగర్ ఉషోదయ టవర్ ముందు సుచిత్ర వెళ్లే రోడ్డులో గురువారం సాయంత్రం 4.30 గంటలకు అటుగా వెళ్లే డీసీఎంపై పడింది. ఏదేని చిన్న వాహనంపై పడినా ప్రమాదం జరిగేది. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు జీహెచ్ఎంసీ అధికారుల సాయంతో చెట్టును తొలగించారు.

చెత్తను తరలించకుండా నిప్పు



రంగారెడ్డినగర్: చెత్త వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని జీహెచ్ఎంసీ అధికారుల నిబంధనలు పారిశుద్ధ్య కార్మికులు పాటించడం లేదు. ప్రధాన రహదారుల వెంబడి చెత్తను ఏ రోజుకారోజు తరలించాల్సి ఉండగా.. కుప్పలుగా పోసి నిప్పు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఇటీవల రోడ్ల వెంబడి చెత్తను సేకరించే కార్మికులకు వాటిని సమీపంలోని డంపింగ్ పాయింట్లకు చేర్చేందుకు ట్రాలీలను అందజేశారు. అయినా చెత్తను తరలించకుండా నిప్పు పెట్టడం కొనసాగుతూనే ఉంది. గాంధీ నగర్– సంజయ్‌గాంధీనగర్ రోడ్డులో గురువారం చెత్తను కుప్పలుగా పోసి నిప్పు పెట్టడం విమర్శలకు తావిస్తోంది.